క్లుప్తంగా

సాగుదారులందరూ ఈకేవైసీ చేయించుకోవాలి

గన్నవరం రూరల్: రబీ పంట సాగు చేస్తున్న రైతులందరూ తప్పక ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్ఎల్ తేజశ్వి చెప్పారు. బుధవారం ఆమె మాట్లాడుతూ రబీ పంటకు గ్రామాల్లోని రైతులు ఇప్పటికే పంట నమోదు చేయించుకున్నారని చెప్పారు. ఇంకా పంట నమోదు చేయించుకోవాల్సిన రైతులు, నమోదు చేయించుకున్న రైతులు అందరూ ఆర్బీకేలలో ఈ నెల 20వ తేదీలోపు తప్పక ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. దీంతో పంట ధ్రువీకరణ జరుగుతుందన్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ, ఉత్పత్తుల కొనుగోలు, పంట నష్టం, పంటల బీమా, రుణాలు వంటి పథకాలు లబ్ధి పొందాలంటే నమోదు, ధ్రువీకరణ తప్పనిసరి అన్నారు.

100 శాతం పన్నులు వసూలు చేయాలి



రామవరప్పాడు : ఇంటి పన్నులను 100 శాతం వసూలు చేసే విధంగా అధికారులు పనిచేయాలని ఈవోఆర్డీ బి. శేషగిరిరావు పంచాయతీ కార్యదర్శి ప్రకాశ్‌నాథ్‌కు సూచించారు. విజయవాడ రూరల్ మండలం నిడమానూరులో బుధవారం ఇంటి పన్నుల వసూళ్ల తీరును శేషగిరిరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటి పన్నుల వసూళ్లు ఎంత వరకు చేశారని కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. దీనికి కార్యదర్శి ప్రకాశ్‌నాథ్ బదులిస్తూ ఇప్పటి వరకూ గ్రామంలో 60శాతం పన్నులు వసూలు చేసినట్లు తెలిపారు. ఇంటి పన్నుల వసూలపై గ్రామస్తులకు అవగాహన పరిచి త్వరితగతిన టార్గెట్‌ను పూర్తి చేయాలని సూచించారు.

వలంటీర్ సేవలు అభినందనీయం



కంకిపాడు: వలంటీర్ సేవలు అభినందనీయమని కంకిపాడు ఎస్సీ కాలనీ వాసులు పేర్కొన్నారు. పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన వలంటీర్ నల్లపు భవాని అందిస్తున్న సేవలకు స్థానికులు సంతృప్తి వ్యక్తం చేస్తూ బుధవారం ఆమెను ఘనంగా సత్కరించారు. ప్రభుత్వానికి, తమకు వారధిగా నిలుస్తూ సంక్షేమ కార్యక్రమాలను చేరువ చేస్తున్నారని, పనితీరు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానికులు తాళ్లూరి మరియబాబు, ఊరి చిన్నా, కె.సతీష్, పి.బుల్లిబాబు, సీహెచ్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బాబా మందిర వార్షికోత్సవం



కంకిపాడు: చలివేంద్రపాలెంలో వేంచేసిన శ్రీ షిర్డీసాయిబాబా మందిరం 17వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హారతి, అన్ని పండ్ల రసాలతో అభిషేకాలు, అష్టోత్తర సహస్రనామ పారాయణం, గీతా పారాయణం జరిపించారు. వార్షికోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. వార్షికోత్సవ కార్యక్రమాలను శ్రీసాయిరామ్ తీర్థ సేవా ట్రస్టు ప్రతినిధులు పర్యవేక్షించారు.

విద్యార్థులు సంగ్రహ శక్తిని పెంచుకోవాలి



గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం రోటరీక్లబ్ ఆఫ్ విజయవాడ ఆధ్వర్యంలో విద్య ప్రేరణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వైజాగ్‌కు చెందిన ప్రముఖ మానసిక తత్వవేత్త, ప్రేరణకర్త వలివేటి సతీష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని అధ్యాపకులు వెలికితీసి పదును పెట్టాలని చెప్పారు. ముఖ్యంగా విద్యార్థులు చదువుతున్న సబ్జెక్టులపై అవగాహన, సంగ్రహ శక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం పాఠ్యాంశాలను తేలిక పద్ధతిలో గుర్తించుకోవడం, విద్యార్థులు నడవవలసిన తీరు, సాంకేతిక విద్య ప్రాముఖ్యతను ఆయన క్షుణ్ణంగా వివరించారు. రోటరీక్లబ్ ప్రతినిధులు రామ్మోహన్‌రెడ్డి, చైతన్య, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బి. మురళీకృష్ణ, విభాగాధిపతి వీవీ. కృష్ణమోహన్, సీనియర్ అధ్యాపకులు వి. ఎలీషా, రామకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాల అమలు

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



పునాదిపాడులో పైపులైన్ పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

కంకిపాడు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించటమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని పునాదిపాడు గ్రామంలో జలజీవన్ మిషన్ నిధులు రూ. 20 లక్షలు అంచనా వ్యయంతో చేపట్టిన పైపులైన్ పనులకు బుధవారం శంకుస్థాపన నిర్వహించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి, పైపులైన్ విస్తరణతో లభించనున్న ప్రయోజనాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక మహిళలతో మాట్లాడారు. ఎంతో కాలంగా స్థానికంగా నివాసం ఉంటున్నామని, ఇళ్లస్థలాలు అందలేదని ఎమ్మెల్యే పార్థసారథికి విన్నవించారు. అర్హతలు ఉన్నా, అధికారులు స్పందించటం లేదని వాపోయారు. దీనిపై ఎమ్మెల్యే పార్థసారథి స్పందిస్తూ రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు, స్థలాలు అందాలన్నారు. ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తుంటే అధికారులు అడ్డుకుంటున్నారనే ఆరోపణలు రాకుండా చూసుకోవాలన్నారు. గ్రామంలో మెరుగైన వసతుల కల్పన, అభివృద్ధి పనులు వేగవంతానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. టీడీపీ నేతలు గ్లోబల్ ప్రచారం సాగిస్తున్నారని మండిపడ్డారు. పదే పదే అబద్ధాలు చెబుతూ వాటినే వాస్తవాలుగా చెప్పేయత్నం చేస్తున్నారని విమర్శించారు. ధరల పెరుగుదలతో ఎంత భారం పడిందో ఎక్కడైనా చర్చకు సిద్ధమేనన్నారు. అవాస్తవాలను, వాస్తవాలుగా చిత్రీకరించే కుట్రకు ప్రతిపక్షాలు తెగబడ్డాయని దుయ్యబట్టారు. ప్రజాక్షేత్రంలో ప్రతిపక్షాలకు తగిన గుణపాఠం తప్పదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ కలపాల ప్రకాష్, ఎంపీటీసీ జి.మార్తమ్మ, మాజీ సర్పంచ్ ముసిబోయిన వెంకటేశ్వరరావు, నాయకులు నెరుసు సతీష్, పిన్నబోయిన శ్రీనివాసరావు, టీ. శ్రీనివాసరావు, తహసీల్దార్ టీవీ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను సమర్థంగా నిర్వహిద్దాం

సమీక్షలో ఆర్డీవో విజయ్‌కుమార్



యనమలకుదురులో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో విజయ్‌కుమార్

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఆర్డీవో ఎస్. విజయ్‌కుమార్ అన్నారు. గ్రామంలో బుధవారం కల్యాణమండపంలో అన్ని శాఖల అధికారులకు ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ గ్రామంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈ నెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. మహాశివరాత్రి పర్వదినం రోజు ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు పూర్తి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భక్తులు పుణ్యనది స్నానాలు చేసే సమయంలో నది వద్ద పూర్తి భద్రత కల్పించాలని సూచించారు. భక్తులు రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున వైద్య శాఖ ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. గుడిపై ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేసి భక్తులకు తాగునీరు సౌకర్యం కల్పించాలని అన్నారు. మహాశివరాత్రి పర్వదినం రాత్రి భక్తుల పోటెత్తే అవకాశం ఉండటంతో పోలీసులు, ఫైర్ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని, శాంతిభద్రతలు కాపాడాలన్నారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పని చేయాలని సూచించారు.ఈ సమావేశంలో తమసీల్దార్ టీవీ. సతీష్, తాడిగడప మునిసిపాలిటీ కమిషనర్ ఎస్.ప్రకాశరావు, సీఐ ఆర్.గోవిందరాజు, ఎంపీడీఓ సునితాశర్మ, మండల వైద్యాధికారి రవికుమార్, దేవస్థానం ఈవో ఎం.గంగాధరరావు, ప్రధాన అర్చకుడు సాగర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

రామవరప్పాడు : విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు, గూడవల్లి గ్రామాల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను బుధవారం డీఎల్‌పీవో కె. చంద్రశేఖరరావు పరిశీలించారు. ఎనికేపాడు పంచాయతీ కార్యాలయం వెనుక ఉన్న చెరువు వద్ద జరిగిన పూడికతీత పనులను పరిశీలించి సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో గ్రామంలోని మురుగంతా ఈ చెరువులోనే కలిసేదని, గ్రామస్తుల కోరిక మేరకు పూడికతీత పనులు పూర్తి చేశామని తెలిపారు. చెరువులో మురుగు కలవకుండా డ్రెయిన్ నిర్మించి ఇబ్బందులు తలెత్తకుండా మురుగునీరు మళ్లించినట్లు వివరించారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, గ్రీనరీ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నామని దీనికి సంబంధించిన పనులపై దృష్టి సారిస్తున్నట్లు సర్పంచ్ పూర్ణ డీఎల్‌పీవో దృష్టికి తీసుకొచ్చారు. ఈ పనులు ప్రారంభమయ్యేలా సహకారం అందించాలని కోరారు. ఈ పరిశీలనలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదవర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



చోడవరంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: పేదవర్గాల ప్రజలు అభివృద్ధి చెందటమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఆయన బుధవారం చోడవరం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులకు బ్రోచర్ అందజేసి సమస్యలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే పార్థసారథి ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలు అభివృద్ధి చెందితేనే సమాజం కూడా అభివృద్ధి సాధిస్తుందన్నారు. అయితే స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా పేద వార్గల్లో అభివృద్ధి ఆశించిన స్థాయిలో లేదన్నారు. ఇది దృష్టిలో ఉంచుకునే సీఎం జగనన్న పేదల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. ప్రధానంగా పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునే విధంగా సంక్షేమ పథకాలు అమలులోకి తీసుకువచ్చామని వివరించారు. జగనన్న పాలనలో ప్రతి పేద కుటుంబం ఆనందంతో ఉన్నారని తెలిపారు.

మోసం చేస్తే మోసపోయే వారు లేరు..

ప్రజలను మోసం చేయాలని చేస్తూ మోసపోయే వారు ఎవ్వరు లేరని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందుతున్నాయని ఇందులో ఎటువంటి అవినీతి లేదన్నారు. ప్రభుత్వం ప్రతి పథకం పారదర్శకంగా అమలు చేస్తోందని ఇందులో ఎటువంటి మోసాలు లేవన్నారు. అయితే చంద్రబాబు నాయుడు పేదలపై అక్కసుతో సంక్షేమ పథకాలపై బురదజల్లుతున్నాడని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని తెలిపారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలతో పేదలకు వేధించారని ఆరోపించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కాకర్ల వెంకటరత్నం, వైఎస్సార్ సీపీ నేతలు మండూరు కోటేశ్వరరావు, బాలకోటేశ్వరరావు, వార్డు సభ్యులు సింగంపల్లి రమాదేవి, పోతర్లంక సువార్త, కొత్తూరు సాగర్, నేతలు కలతోటి ప్రసాద్, చోడవరపు రవిచంద్, దాసరి సాయిబాబు, శీలం రవిచంద్, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు,పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు చిరుధాన్యాలపై అవగాహన

విజయవాడ రూరల్: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువారం నిడమానూరు గ్రామంలో చిరుధాన్యాల సాగుపై అవగాహన కార్యక్రమం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. రైతులకు అవగాహన కల్పించేందుకు జిల్లా వనరుల కేంద్రం నుంచి కోఆర్డినేటర్స్ టి.మాధవీలత, మోనిషా పాల్గొంటారని ఆయన తెలియజేశారు. రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తహసీల్దార్‌గా జాహ్నవి బాధ్యతల స్వీకరణ



విజయవాడ రూరల్: విజయవాడ రూరల్ మండల తహసీల్దార్‌గా పి.జాహ్నవి బుధవారం ఇన్‌చార్జి తహసీల్దార్ విజయకుమార్ నుంచి బాధ్యతలను స్వీకరించారు. అనంతరం కార్యాలయం గ్రామ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏదైనా సమస్యలుంటే చెప్పాలని అడిగారు. పిమ్మట ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ విజయకుమార్, కార్యాలయం సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్‌కు ముగ్గురు విద్యార్థులు



సైక్లింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నున్న(విజయవాడరూరల్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్) అంతర్ జిల్లాల సైక్లింగ్ పోటీలకు నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికై నట్టు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.భూపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-14 బాలికల విభాగంలో డి.లక్ష్మీభాయ్, అండర్-17 బాలుర విభాగంలో డి.రామ్‌చంద్, అండర్-19 బాలికల విభాగంలో డి.పూజిత కృష్ణాజిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈ నెల 12, 13 తేదీల్లో అండర్-17, అండర్-19 బాలుర, బాలికలకు,16, 17 తేదీల్లో అండర్-14 బాలబాలికలకు రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలు నిర్వహించనున్నారు. సైక్లింగ్ పోటీలకు ఎంపికై న విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు వి.భూపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీవో పద్మావతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని గుడివాడ ఆర్డీవో పి.పద్మావతి అన్నారు. స్థానిక మహాత్మాగాంధీ నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న కాలనీ గృహ నిర్మాణాలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులతో బుధవారం ఆమె సమీక్ష నిర్వహించారు. బాపులపాడు మండలంలో మొత్తం సుమారు 3000 మంది లబ్ధిదారులకు గృహరుణాలు మంజూరు కాగా కేవలం 500 మంది మాత్రమే ఇప్పటి వరకూ నిర్మాణాలు పూర్తి చేశారని ఆమె చెప్పారు. దీనిపై ఆర్డీవో పద్మావతి మండలంలోని గ్రామాల వారీగా ఆయా అధికారులకు టార్గెట్లు నిర్ణయించారు. వచ్చే నెలలో ఉగాది పర్వదినం నాటికి జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు పూర్తి చేసేలా తక్షణం చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ఇంకా ఇంటి నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులను కలిసి ప్రభుత్వం అందిస్తున్న గృహ రుణాల గూర్చి వివరించాలని చెప్పారు. నిర్మాణ దశలో ఉన్న ఇళ్లు వేగంగా పూర్తి చేసేందుకు లబ్ధిదారులతో చర్చలు జరపాలని సూచించారు. తహసీల్దార్ సీహెచ్ నరసింహరావు, డెప్యూటీ తహసీల్దార్ వెంకట రమణ, ఎంపీడీవో ప్రభాకరరావు, పంచాయతీ రాజ్ ఏఈ డి.జయరాజు, హౌసింగ్ ఏఈ డి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కంటి సమస్యలపై నిర్లక్ష్యం తగదు



కంకిపాడు: కంటి సమస్యలపై నిర్లక్ష్యం తగదని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వీవీ రాజేష్‌కుమార్ అన్నారు. మండలంలోని కుందేరు గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. 60 ఏళ్లు నిండిన అవ్వాతాతలకు కంటి పరీక్షలు నిర్వహించి ప్రాథమిక దశలో కంటి సమస్యలు ఎదుర్కొంటున్న అవ్వాతాతలకు మందులు అందించారు. దృష్టి లోపాలతో బాధపడుతున్న వృద్ధులకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. 110 మంది వృద్ధులకు పరీక్షలు జరిపించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత కలకోట లక్ష్మీవరప్రసాద్‌రెడ్డి, వైద్య సిబ్బంది మోహన రూప, పి.బేబి, ఎస్.శారదాప్రియా, డి.సిపోరి, వీఆర్‌ఓ మద్దూరు రఘురామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడుపుతున్న వారిపై కేసు

పెనమలూరు: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వ్యక్తులపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోరంకి, తాడిగడప, కానూరు, యనమలకుదురులో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న పది మంది వ్యక్తులు పట్టుబడ్డారు. వారిపై కేసులు నమోదు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ గోవిందరాజు తెలిపారు.

అర్హులైన వారికి స్థలాలు మంజూరు చేయాలి



తహసీల్దార్ జాహ్నవి కి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

విజయవాడరూరల్: నున్న గ్రామంలో అర్హులైన పేద కుటుంబాలకు జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని నున్న గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు తహసీల్దార్ పి.జాహ్నవిని కలిసి విజ్ఞప్తి చేశారు. బుధవారం రూరల్ మండల తహసీల్దార్‌గా ఉద్యోగ బాధ్యతలను చేపట్టిన జాహ్నవిని గౌరవంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సాంకేతిక కారణాల వల్ల మొదటి విడత ఇళ్ల స్థలాలు మంజూరు కాని అర్హులైన పేదవారికి ఇళ్ల స్థలాలను అందజేయాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలు అనుసరించి అర్హులైన వారికి ఇళ్ల స్థలాలను పంపిణీ చేయడానికి కృషి చేస్తానని తహసీల్దార్ చెప్పారు. ఆమెను కలిసిన వారిలో నున్న గ్రామ పార్టీ కన్వీనర్, సొసైటీ చైర్మన్ పోలారెడ్డి చంద్రారెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, గ్రామ ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, సొసైటీ డైరెక్టర్ భీమవరపు ముత్తారెడ్డి ఉన్నారు.

ఉపాధ్యాయ కో ఆపరేటివ్ సొసైటీ ఎన్నిక



నియామకపత్రం అందుకుంటున్న నూతన అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

ఉయ్యూరు: ఉపాధ్యాయ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా వీరంకి వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఉయ్యూరు, పమిడిముక్కల మండలాల స్థాయి టీచర్స్ కోఆపరేటివ్ సొసైటీ నూతన కార్యవర్గం ఎన్నిక గండిగుంటలోని సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడుగా వీరంకి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షురాలిగా శ్యామలకుమారి, కార్యదర్శిగా ఎన్వీ సుబ్బయ్య, డైరెక్టర్లుగా పద్మజ, సతీష్‌కుమార్, మురళీమోహన్, మాధవిలు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి ఏపీటీఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి పాండురంగ ప్రసాద్, ఎన్నికల అధికారి నాగఫణికుమారి నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్ఎంలు హుజన్ అహ్మద్, పి.కోటేశ్వరరావు, మణిలాల్, పరాత్పరి పాల్గొన్నారు.

25 మంది విద్యార్థుల రక్తదానం



గన్నవరం రూరల్: మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో బుధవారం రక్తదాన శిబిరం జరిగింది. ఓరల్ అండ్ మ్యాక్సిలో ఫేషియల్ సర్జన్ ఏపీ చాప్టర్ ఆధ్వర్యంలో 25 మంది రక్తదానం చేశారు. హెచ్‌వోడీ డాక్టర్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ఓరల్ మ్యాక్సిలో ఫేషియల్ డే ఈ నెల 13వ తేదీన జరగనున్న నేపథ్యంలో వారం రోజుల పాటు విద్యార్థులకు వివిధ కార్యక్రమాలు నిర్వహించటంతో పాటు వారిలో సేవా భావాన్ని పెంపొందిస్తున్నట్లు వివరించారు.

150 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

పాతపాడు(విజయవాడరూరల్): పాతపాడు గ్రామంలో గుబ్బలగట్టు వద్ద కోళ్లఫారమ్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం150 క్వింటాళ్లను సివిల్ సప్లయీస్ అధికారులు బుధవారం మెరుపుదాడి చేసి పట్టుకొన్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడకు చెందిన వి.శ్రీనివాసరావు నగరంలోని వివిధ ప్రాంతాల్లో రేషన్ బియ్యం కొనుగోలు చేసి, పాతపాడు గ్రామంలో కోళ్ల ఫారమ్ నందు నిల్వ చేసినట్టు అధికారులు తెలిపారు. స్థానికుల నుంచి వచ్చిన సమాచారం మేరకు జిల్లా సివిల్ సప్లయీస్ అధికారి కోమల పద్మ ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు చేసి 150 క్వింటాళ్ల అక్రమ రేషన్ బియ్యం నిల్వలు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని పి.నైనవరం గ్రామంలోని రైస్‌మిల్లుకు తరలించారు.

పోలీసులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సారమ్మ

గన్నవరం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం గన్నవరం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులకు ఉచిత వైద్య పరీక్షల శిబిరం నిర్వహించారు. డీఎస్పీ కె. విజయపాల్ నేతృత్వంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సారమ్మ పర్యవేక్షణలో సిబ్బంది పోలీసులకు బీపీ, సుగర్, ఈసీజీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ తమ డివిజన్‌లో పని చేస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ వైద్య పరిక్షల శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్క పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ఆరోగ్య రక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మన్నే సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి కాకినాడకు చెందిన జి.మామిడాడకు చెందిన ఎస్.రామచంద్రారెడ్డి రూ.1,01,116ల విరాళాన్ని అందజేశారు. ఆలయ మర్యాద ప్రకారం అమ్మవారి దర్శనం చేయించారు. వేదపండితుల ఆశీర్వచనం అనంతరం అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను ఆలయ అధికారులు అందించారు.

ముగిసిన నవదిన ప్రార్థనలు

గుణదల(విజయవాడతూర్పు): మేరీమాత పుణ్యక్షేత్రంలో గత తొమ్మిది రోజులుగా జరుగుతున్న నవదిన ప్రార్థనలు బుధవారంతో ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు పెద్ద సంఖ్యలో క్రైస్తవులు హాజరయ్యారు. పలు విచారణల భక్తులు, మతకన్యలు, పుణ్యక్షేత్ర గురువులు జపమాలలు ధరించి కొండపైకి చేరుకున్నారు. మరియమాత స్వరూపం వద్ద జరిగిన సమష్టి బలి పూజలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ దేవుని వాక్య సందేశం అందించారు. ఆయన మాట్లాడుతూ.. మరియమాత చల్లని దీవెనలు భక్తులందరిపై ఉంటాయన్నారు. మరియ తల్లిని ఆశ్రయించిన భక్తుల జీవితాలు ఆనందంగా ఉంటాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆ నిష్కళంక మాతకు విధేయులుగా ఉండాలని కోరారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సమష్టి దివ్య బలిపూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతం



హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సామూహిక శ్రీరమా సమేత సత్యనారాయణ స్వామి వ్రతం వైభవంగా జరిగింది. మాఘమాసం ఏకాదశిని పురస్కరించుకుని ఆలయంలో 48 మంది దంపతులతో వ్రతం నిర్వహించారు. వ్రతంలో పాల్గొన్న దంపతులకు ఆలయ ట్రస్టీ కాకాని వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ అరుణ దంపతులు పూజా సామగ్రిని ఉచితంగా అందించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి యార్లగడ్డ శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రధాన అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు భక్తులతో సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో చేయించారు.